క్లుప్తంగా

నేడు అప్పికొండమ్మ జాతర

గొలుగొండ: మండలంలోని ఏఎల్ పురంలో కొలువైన అప్పికొండమ్మ ఆలయం వద్ద గురువారం జాతర నిర్వహించనున్నారు. ఈ మేరకు కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. అమ్మవారి పండగ సందర్భంగా విద్యుత్ అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం అమ్మవారి దర్శనం కోసం సమీప గ్రామస్తులు తరలిరానున్నారు.

సాయిబాబా ఆలయంలో కంటి వైద్య శిబిరం



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీనిజ

నర్సీపట్నం: శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో శ్రీషిర్డీసాయి సేవా సమాజ్ సాయిబాబా ఆలయంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శ్రీనిజ 98 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 38 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసి, శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. కంటి విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఉచితంగా ఫౌండేషన్ ద్వారా వైద్య సేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో సేవా సమాజ్ ప్రతినిధులు లంక ఈశ్వరరావు, ఎం.రాజేష్, పి.రామారావు, క్యాంపు మేనేజర్ అరుణ్ కుమార్, కో ఆర్డినేటర్ సతీష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బళ్ల వేషాలు



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన బళ్ల వేషాలు

మాడుగుల: మాడుగుల మోదకొండమ్మ పండగలో బళ్ల వేషాలు ఆకట్టుకున్నాయి. పండగల్లో ఒకప్పుడు బళ్ల వేషాల మంచి ఆదరణ ఉండేది. అమ్మవారి సంబరాల్లో సుమారు పది నుంచి 20 బళ్లలో వేషాలు వేసేవారు. ప్రస్తుతం అమ్మవారికి మొక్కుకున్న వారు మాత్రమే బళ్ల వేషాలు వేస్తున్నారు. అమ్మవారి పండగలో బళ్ల వేషాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

అపరాల సాగుకు మేలు చేసిన వర్షాలు



కొత్త అగ్రహారంలో సాగులో ఉన్న పెసర పంట

కె.కోటపాడు: ఇటీవల కురుస్తున్న వర్షాలు అపరాల సాగుకు మేలు చేసినట్లు రైతులు తెలిపారు. చెరకు అనంతరం రైతులు మినప, పెసర, నువ్వు పంటలను సాగు చేస్తున్నారు. మండలంలో వారాడ, వి.సంతపాలెం, ఆర్.వై. అగ్రహారం, ఎ.కోడూరు, కొత్త అగ్రహారం, సింగందొరపాలెం, కొత్త అగ్రహారం గ్రామాల్లో 100 ఎకరాల్లో రైతులు అపరాల పంట సాగు చేస్తున్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

మాకవరపాలెం: పీఎం కిసాన్ నిధి నగదు జమ సందర్భంగా బుధవారం బీజేపీ నేతలు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండల కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు అడిగర్ల రాంబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు నాయుడు, నాయకులు చుక్కల శ్రీను, ఆంజనేయులు పాల్గొన్నారు.

వేడుకగా కల్యాణ వేంకటేశ్వర స్వామి తిరువీధి ఉత్సవం

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి తిరువీధి ఉత్సవం బుధవారం రాత్రి నిర్వహించారు. స్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ రాపేట రామకొండలరావు, ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పల నాయుడు, కోశాధికారి పుట్టా బలరామమూర్తి, సభ్యులు యల్లపు రాము, రాపేట జోగి నాయుడు, భక్తులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7997958337, 7075709854,
7997958336
సాక్షి

రహదారి గోతులమయం

- బీఎన్ రోడ్డులో రాకపోకలకు అవస్థలు
- ప్రమాదాల బారిన ప్రయాణికులు



ఎల్‌బీ పురం వద్ద గోతులతో నిండిన రోడ్డు



బంగారుమెట్ట వద్ద చెరువును తలపిస్తున్న రహదారి

బుచ్చెయ్యపేట: భీమునిపట్నం, నర్సీపట్నం (బీఎన్) ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఏర్పడిన గోతులతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి పూట గోతుల్లో చేరిన నీటిలో ఎక్కడ గొయ్యి ఉందో తెలియక పలువురు వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షంలో తడుస్తూ గోతులు కనబడక రావికమతం గ్రామానికి చెందిన భార్యాభర్తలు ద్విచక్ర వాహనంపై వస్తూ ఎల్‌బీ పురం వద్ద గోతుల్లో పడిపోవడంతో భార్యకు గాయాలయ్యాయి. బుదిరెడ్లపాలెం, పొట్టిదొరపాలెం, శింగవరం, బంగారుమెట్ట, ఎల్‌బీ పురం గ్రామాల వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డులో పెద్దపెద్ద గోతులు పడ్డాయి. వాటిలో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. గోతులు వద్ద వాహనాలు తప్పుకునేటపుడు ఎదురెదురుగా వస్తున్న వాహన చోదకులు తికమకపడి వాహనాలు ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వంలో నిధులు మంజూరైన కాంట్రాక్టర్ సకాలంలో పనులు చేపట్టలేదు. కొన్ని గ్రామాల వద్ద రోడ్డు వేసి సగం సగం పనులతో ఆపేశారు. భారీ వాహనాల రాకపోకలతో గోతుల్లోని బురద నీరు చిన్న వాహనాలపై, పాదచారులపై పడి అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రమాదాలు జరగకుండా గోతులను పూడ్చి ప్రమాదాలు నివారించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మంగళాపురంలో అంగన్‌వాడీ బడిబాట



బడిబాట ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది, పిల్లలు

బుచ్చెయ్యపేట: మండలంలోని మంగళాపురంలో బుధవారం అంగన్‌వాడీ సిబ్బంది బడిబాట ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో ర్యాలీ చేసి నాలుగేళ్ల వయసు దాటిన పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండి ఆరేళ్ల వయసు వచ్చిన పిల్లలకు సర్టిఫికెట్లు అందించి స్థానికంగా ఉన్న ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. తల్లిదండ్రులంతా తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించి విద్యాబోధనలు అందేలా చేయాలని అంగన్‌వాడీ టీచర్ కె.వి.ఎస్.రాధ, సచివాలయ మహిళా పోలీస్ మహాలక్ష్మి, ఎంపీహెచ్‌వో రేవతి తదితరులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

30 మంది రక్తదానం



రక్తదాన శిబిరంలో 26వ సారి రక్తం ఇస్తున్న ఆదారి శివకేశవ

మాడుగుల రూరల్: మండలంలోని కేజేపురంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్టీఆర్ రక్తదాన ట్రస్ట్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 30 మంది రక్తదానం చేశారు. ఈ గ్రామానికి చెందిన ఆదారి శివకేశవ అనే యువకుడు 26వ సారి రక్తందానం చేశాడు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి జన్మదినం సందర్భంగా నిర్వహించిన శిబిరంలో పలువురు పాల్గొన్నారు.

పేదలకు వస్త్రాల పంపిణీ



మహిళలకు వస్త్రాలు అందిస్తున్న జగతా శ్రీనివాసరావు

చోడవరం రూరల్: భావి భారత ప్రధాని కాగల సత్తా ఉన్న నేత రాహుల్ గాంధీ అని ఏపీపీసీసీ కార్యదర్శి, చోడవరం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి జగతా శ్రీనివాసరావు ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణ సమీపంలోని మారుతీనగర్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన పేరున ఆలయంలో పూజలు చేయించి, రాహుల్ గాంధీ చిత్రపటం ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. పెద్ద సంఖ్యలో పేద మహిళలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగతా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలన్నది ప్రజలందరి కోరికని, భవిష్యత్తులో నెరవేరతుందని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నూకరాజు, అప్పారావు, తవ్వా వీర్రాజు, నాని, సత్యవతి, వీర్ని లక్ష్మి, సుజాత, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుండపోత వర్షం



చిన్నయ్యపాలెంలో కురుస్తున్న వర్షం

గొలుగొండ: మండలంలో బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పంట పొలాలు నీటితో నిండిపోయాయి. ధారకొండపై కురిసిన భారీ వర్షం కారణంగా ధారగెడ్డ, బొడ్డేరు, గొర్రిగెడ్డల నుండి వర్షం నీరు ప్రవహించి తాండవ జలాశయానికి చేరింది. అలాగే వర్షం కారణంగా విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఖరీఫ్‌కు ముందు ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని రైతులంటున్నారు. ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం పూర్తిగా ఉపశమనం కలిగించింది.

సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు శైలజ, సాయికిరణ్

కె.కోటపాడు: సికిల్ సెల్ అనీమియా వ్యాధిగ్రస్తులను గుర్తించడం ద్వారా ఇతరులకు వ్యాధి సంక్రమించకుండా చర్యలు తీసుకోవచ్చని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అన్నారు. సికిల్ సెల్ డే సందర్భంగా లంకవానిపాలెంలో వైద్య సిబ్బంది వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శైలజ మాట్లాడుతు సికిల్ సెల్ వ్యాధికి సరైన మందులు లేనందున, బాధితులను గుర్తించి వారి మధ్య వివాహాలు నిరోధించి ఈ వ్యాధిని నివారించే అవకాశం ఉందన్నారు. ఈ వ్యాధి బారిన పడే వారి రక్తం చిక్కబడటంతో పాటు శ్వాస సంబంధిత వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి సాయికిరణ్, పీహెచ్ఎన్ ప్రమీల, హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు, హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ పాల్గొన్నారు.

కామధేనువు అమ్మవారి పండగ నేడు

మాకవరపాలెం: మండలంలోని శెట్టిపాలెంలో గురువారం కామధునువు అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా ఈ పండగను స్థానికులు భారీ ఎత్తున నిర్వహిస్తారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కింతలి వల్లాపురంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు



కుళాయి కనెక్షన్లను ప్రారంభిస్తున్న స్థానిక నాయకులు

మాడుగుల రూరల్: కింతలి వల్లాపురంలో వాటర్ ట్యాంక్, ఇంటింటి కుళాయి కనెక్షన్‌ను గ్రామ సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి, ఎంపీటీసీ సభ్యురాలు బగుడు వరహాలమ్మ బుధవారం ప్రారంభించారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంలో రూ. 1.60 కోట్లను ఇందుకు వెచ్చించారు. దీని వల్ల గ్రామంలోని 540 ఇళ్లకు కుళాయిల ద్వారా మంచినీరు అందనుంది. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తాళ్లపురెడ్డి రాంబాబు, బగుడు సీతారామయ్య, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి తాళ్లపురెడ్డి సోమన్నదొర, గ్రామ ఉప సర్పంచ్ మట్టా గోవింద, స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ అప్పారావు

మాడుగుల: మండలంలోని కింతలిలో విద్యార్థులకు బుధవారం పాఠ్య పుస్తకాలు, బూట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మైచర్ల భవానీ, ఎంపీటీసీ సభ్యుడు మైచర్ల సన్యాసిరావు, విద్యా కమిటీ చైర్‌పర్సన్ సుంకరి దేవీ, హెచ్‌ఎం బంగారయ్య, కమిటీ మెంబర్ మజ్జి అరుణ్ కుమార్, వార్డు సభ్యులు కొమ్మోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తురువోలు ఉన్నత పాఠశాలలో..

చీడికాడ : మండలంలోని తురువోలు ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసినట్లు హెచ్.ఎం.రామకృష్ణ తెలిపారు. పాఠశాలలో 220 మంది విద్యార్థులుండగా వారందరికీ పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, బుట్లు అందించామన్నారు. ఇంకా బ్యాగులు రావాల్సి ఉందన్నారు. వీటిని సర్పంచ్ మట్టా అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు బీశ్ల కోటేశ్వరరావు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాత్రిని సురేష్, చొక్కాకుల వెంకునాయుడు, బొడ్డు శ్రీరామమూర్తి, ఉపాధ్యాయులు జి.పి.ఎ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం



కనకదుర్గమ్మకు పసుపు కుంకుమలు సమర్పిస్తున్న భక్తులు

తుమ్మపాల: పట్టణంలోని గవరపాలెం సతకంపట్టు కనకదుర్గ అమ్మవారి ఆలయ సప్తమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బోగాపురపు వెంకటరమణ(బాబు) ఆధ్వర్యంలో దుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు సంఖ్యలో తరలి వచ్చి పూజలు చేశారు. మొక్కులు తీర్చుకున్నారు. ప్రముఖ బిల్డర్, సంఘ సేవకుడు కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి దంపతులు, మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమలు, చీరలు అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే సర్వసభ్య సమావేశం



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ మణికుమారి తదితరులు

గొలుగొండ: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ గజ్జలపు మణికుమారి తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతను బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గొలుగొండ సర్పంచ్ కసిపల్లి అప్పారావు మాట్లాడుతూ గొలుగొండలో జాతీయ ఉపాధి హామీ పథకంలో కేటాయించిన పనులు మంజూరు కాలేదన్నారు. శివారు గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని, వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణం పనులు జరిగేలా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు. పుత్తడిగైరంపేట సర్పంచ్ పత్తి రమణ, ఏఎల్ పురం సర్పంచ్ లోచల సుజాత మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు వరిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తమల్లంపేట సర్పంచ్ రాజుబాబు మాట్లాడుతూ డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీడీవో రత్నకుమారి, వైస్ ఎంపీపీ సుర్ల ఆదినారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు కృషి చేయాలి



సచివాలయ సిబ్బందితో సమావేశమైన మంజులవాణి

కె.కోటపాడు : పంచాయతీ సిబ్బంది గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు కృషి చేయాలని డివిజినల్ డెవలప్‌మెంట్ అధికారి మంజులవాణి అన్నారు. వారాడ సచివాలయంలో బుధవారం ఆమె అక్కడి సిబ్బందితో సమావేశమయ్యారు. వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్‌లో రైతులకు కావాల్సిన వరి విత్తనాలను వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో డ్రాపౌట్స్ లేకుండా బడి ఈడు పిల్లలు బడులకు వెళ్లేలా తల్లిదండ్రులకు సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శులు ప్రశాంత్, ఎస్.రామునాయుడు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ ప్రారంభం



విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రమణబాబు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు



రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న నాయకులు



ఎం. అలమండ ఆర్‌బీకేలో రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్న సర్పంచ్ జగన్ తదితరులు

మాడుగుల రూరల్ : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి విత్తనాలను గ్రామాల్లో పంపిణీ చేస్తున్నారు. కె.జె.పురం రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం గ్రామ సర్పంచ్ జామి రమణబాబు, ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు వరి విత్తనాల పంపిణీని ప్రారంభించారు. వీఏఏ సల్లా శ్రావణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు రాపేట జోగి నాయుడు, యల్లపు రాము (రెబల్), ఆదారి బాబ్జి, శరగడం ఆదిబాబు, కర్రి నాగమణి, ఆదారి జగదీష్, మద్దాల కృష్ణ, జనసేన నాయకులు రాపేట రాజశేఖర్, హరిబాల, మద్దాల రమణ, వార్డు సభ్యులు బుద్దా కొండారావు, బి.నాగేశ్, బి. కోటప్పారావు, గుడియా గోవింద తదతరులు పాల్గొన్నారు.

ఎం.అలమండలో..

దేవరాపల్లి : ఎం. అలమండ రైతు భరోసా కేంద్రంలో ప్రభుత్వం సరఫరా చేసిన ఖరీఫ్ వరి విత్తనాలను బుధవారం సర్పంచ్ దాడి జగన్ అందజేశారు. స్వర్ణ, ఆర్‌జీఎల్, సాంబ మసూరి తదితర రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంపీటీసీ పోతల వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బండారు ప్రసాదరావు, మాజీ జెడ్పీటీసీ పోతల పాత్రునాయుడు, గొర్లి గోవింద తదితర స్థానిక నాయుకులు, గ్రామ పెద్దలు, రైతులు, స్థానిక ఆర్‌బీకే ఇంచార్జి కె. జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్‌కు వరి విత్తనాల పంపిణీ

నాతవరం : ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఇబ్బంది పడకుండా వరి విత్తనాలు పంపిణీ చేయాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. మండలంలో గల ఆర్‌బీకే కేంద్రంలో బుధవారం రైతులకు వరి విత్తనాలు పంపిణీ ప్రారంభించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి విత్తనాల కేటాయింపు వివరాలను వ్యవసాయాధికారి శైలజ వివరించారు. విత్తనాలతో పాటు 50 శాతం రాయితీపై విత్తనాలను శుద్ధి చేసే సోడోమోనస్ పౌడర్ కూడా పంపిణీ చేస్తున్నామన్నారు. వరి విత్తనాలు కావలసిన రైతులు స్థానికంగా ఉన్న ఆర్‌బీకే కేంద్రానికి వెళ్లి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే వెంటనే విత్తనాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, నాతవరం సర్పంచ్ గొలగాని రాణి, మండల టీడీపీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్, మాజీ ఎంపీపీలు సింగంపల్లి సన్యాసిదేముడు, నేతల విజయకుమార్, తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అపిరెడ్డి మాణిక్యం, నాతవరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు శెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



విద్యార్థిని బడిలో చేర్పిస్తున్న ఉపాధ్యాయులు, కార్యదర్శి



విద్యార్థుల ర్యాలీలో పాల్గొన్న ఎంఈవోలు సత్యనారాయణ, ప్రసాద్

మాకవరపాలెం: బడి ఈడు పిల్లలను తల్లిదండ్రులు పాఠశాలల్లో చేర్పించాలని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం కె.రాము కోరారు. విద్యా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నేను బడికి పోతా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. బడి మానేసిన దినేష్‌కుమార్ అనే విద్యార్థిని తిరిగి పాఠశాలలో చేర్పించారు. విద్యాభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాబూరావు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బడుల్లోనే పిల్లలు ఉండాలి

కె.కోటపాడు: ఉన్నత చదువులతోనే మంచి ఉద్యోగావకాశాలు వస్తాయని మండల విద్యాశాఖాధికారులు సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ అన్నారు. ఎ.కోడూరు హైస్కూల్లో బుధవారం నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఉపాధ్యాయులు నిర్వహించిన ర్యాలీలో ఎంఈవోలు సత్యనారాయణ, ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. 6 నుండి 14 ఏళ్ల వయసు గల విద్యార్థులు తప్పనిసరిగా బడికి రావాలన్నారు. డ్రాపౌట్ విద్యార్థులను ఉపాధ్యాయులు పాఠశాలలకు వచ్చేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, జె.అమృతరావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

దేవరాపల్లి: బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక ఎంపీడీవో సీహెచ్ సుబ్బలక్ష్మి అన్నారు. తన కార్యాలయంలో బడికి పోతాం కార్యక్రమంపై మండల విద్యాశాఖ అధికారులు బి.పడాల్‌దాస్, ఎంఈవో-2 వి.ఉషారాణి, తహసీల్దార్ జి.లక్ష్మీనారాయణతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 6 నుంచి 14 ఏళ్ల వయసున్న పిల్లందరినీ బడిలో చేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతో పాటు గ్రామ స్థాయిలోని అన్ని శాఖల అధికారులదీ అన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి కొండలరావు

మాడుగుల రూరల్: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రాహుల్‌గాంధీ 55వ జన్మదిన వేడుకలు బుధవారం రాత్రి మాడుగులలో నిర్వహించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి పడాల కొండలరావు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు అధికార మదంతో విర్రవీగిన బీజేపీ ప్రభుత్వానికి రాహుల్‌గాంధీ నాయకత్వంలో చావు దెబ్బ తగిలిందన్నారు. పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ బుడబండి రాజు, యూత్ కన్వీనర్ ఏసురాజు, సీనియర్ నాయకులు పుట్టా అమరయ్యగుప్త తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com